క్లుప్తంగా

'చెల్లి చనిపోవడంతో అద్దాలు పగులగొట్టాడు'



ఆసుపత్రి అద్దాలు పగల గొట్టడంతో గాయాలపాలైన అజ్జు

గుత్తి: కళ్ల ముందే చెల్లి చికిత్స పొందుతూ చనిపోవడంతో ఓ అన్న ఆసత్రి అద్దాలు పగులగొట్టాడు. వివరాలు.. గుత్తి మండల పరిధిలోని బసినేపల్లికి చెందిన రమీజా అనారోగ్యానికి గురికావడంతో బుధవారం రాత్రి గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రమీజా మృతి చెందింది. తన కళ్ల ఎదుటే చెల్లి మృతి చెందడంతో మృతురాలి అన్న అజ్జు కోపంతో ఊగిపోయాడు. చేతులతో ఆస్పత్రి అద్దాలు పగులగొట్టాడు. ఈ ఘటనలో అతడి చేతికి గాయాలు కావడంతో వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

గార్లదిన్నె: వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా పేర్కొన్నారు. గురువారం గార్లదిన్నెలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని వారికి జరిమానా విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అలాగే కారు డ్రైవింగ్ చేసే వారు సీటు బెల్టు తప్పక ధరించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు.

రైల్వే జోన్‌ను తరలించొద్దు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: రైల్వే జోన్‌ను విశాఖకు తరలించకుండా యథావిధిగా సికింద్రాబాద్‌లోనే కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటును తమ వ్యతిరేకిస్తుందన్నారు. విశాఖలో జోన్ కార్యాలయం ఏర్పాటు చేస్తే గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో పనిచేసే రైల్వే ఉద్యోగ, కార్మికులకు చాలా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల తమ డివిజన్‌ను యథావిధిగా సికింద్రాబాద్ జోన్‌లో కొనసాగించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు జగ్గిలిరమేష్, నాగరాజు, సురేంద్ర, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం జరిపిస్తున్న అర్చకులు

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురం రోడ్డు సమీపంలో దేవరకొండపై వెలసిన కొండమీద రాయుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద మంత్రాలతో హోమం చేశారు.

హెచ్‌ఎం ఆకస్మిక మృతి

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌కు చెందిన నంబర్-1 పాఠశాల హెచ్‌ఎం వెంకట సత్యనారాయణ రావు (59) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. నాలుగు రోజులు క్రితం ఈయన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు గుత్తిలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ రావు మృతికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివ శంకర్, శ్రీధర్ గౌడ్, నాగరాజు, సత్య, బసవరాజు, ఆదినారాయణ రెడ్డి, ప్రదీప్, ఆసీఫ్, బాషా, లక్ష్మణ్ తదితరులు సంతాపం ప్రకటించారు.

రారండోయ్.. చెన్నమయ్య జాతరకు వెళ్దాం

- నేటి నుంచి శ్రీదేవిభూదేవి సమేత చెన్నమయ్య స్వామి జాతర
- 8న పంచలోహ విగ్రహ ఉత్సవ మూర్తులకు సంప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ
- 12న స్వామి వారి కల్యాణోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

యాడికి: మండలంలోని లక్షుంపల్లి పంచాయతీ సమీపంలో గుట్టల నడుమ వెలసి, భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చెన్నమయ్య స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జాతరలో భాగంగా శుక్రవారం ఉదయం యాడికి మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి 11 ఎద్దుల బండ్లమీద శ్రీదేవి-భూదేవి సమేత చెన్నకేశవ స్వామి.. రెడ్డి గుడిసెలు గ్రామ సమీపంలో కొండల్లో ఉన్న చెన్నమయ్య కోనకు చేరుకుంటారు. 8వ తేదీన ఉదయం ఉత్సవ మూర్తులకు చెన్నకేశవ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు హరికృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11న పోతులూరి వీరబ్రహ్మం జీవిత చరిత్ర నాటక ప్రదర్శన, 12న చెన్నమయ్య స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి రామానాయుడు తెలిపారు. జాతర సందర్భంగా ఇప్పటికే ఆలయ నిర్వాహకులు ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మహా విష్ణువు సేదదీరిన చోటు..

మహా విష్ణువును అలంకార ప్రియుడిగానే భక్తులు కొలుస్తుంటారు. అలాంటి మహా విష్ణువు శ్రీదేవిభూదేవి సమేతుడై స్వయంభువుగా పుట్టలో వెలసి భక్తుల కొంగు బంగారమై చెన్నమయ్య స్వామిగా విరాజిల్లుతున్నాడు. యాడికి మండలం రెడ్డి గుడిసెలు గ్రామం మీదుగా నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కొమ్మేమర్రికి వెళ్లే మార్గంలో ఉన్న ఎర్రమల కొండలు.. యాడికి మండలం లక్షుంపల్లి పంచాయతీలోని నల్లమల కొండల నడుమ అభయారణ్యంలో చెన్నమయ్య స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం చుట్టూ ఉన్న దట్టమైన అడవి, పెద్ద పెద్ద బండరాళ్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. విద్యుత్, నీరు, సత్రాలు, కొండల్లో ఉన్న దేవాలయం వరకు మెట్లు, రోడ్డు సౌకర్యం కల్పించారు.



దేవాలయానికి వెళ్లేందుకు మెట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఇంటి దేవుడిగా చెన్నమయ్య..

చెన్నమయ్య స్వామి దేవాలయ పరిసర గ్రామాల్లో చెన్నమయ్య స్వామిని ఇంటి దేవుడిగా కొలుస్తున్నారు. వారి ఇళ్లలోని పిల్లలకు చెన్నమయ్య స్వామి, చంద్రాయుడు, చెన్నప్ప, చెన్నమ్మ, తదితర పేర్లను పెట్టుకుంటారు. పూర్వం దేవాలయ పరిసరాల్లో మాఘమాసంలో తిరునాల జరిగేది. ఈ ఏడాది భక్తుల విరాళాలతో జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. యాడికి మండల కేంద్రం నుంచి చంద్రాయుని పల్లి, రామన్న గుడిసెలు, రెడ్డి గుడిసెలు మీదుగా చెన్నమయ్య స్వామి ఆలయాన్ని చేరుకోవచ్చు.



అలంకరణలో చెన్నమయ్య స్వామి ఉత్సవ విగ్రహాలు

అన్ని ఏర్పాట్లు చేశాం



చెన్నమయ్య స్వామి దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గతంలో కొండల్లో ఉన్న దేవాలయం వద్దకు వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. దాతల సహకారంతో రోడ్డు సౌకర్యం కల్పించారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరిస్తున్నారు.

– రామానాయుడు, పూజారి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో గురువారం వేకువజామున ఆటో- బైక్ ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి ఆర్ఎస్ తోళ్లషాపు కాలనీకి చెందిన షానవాజ్, అవినాష్ పని నిమిత్తం జొన్నగిరికి వెళ్లి తిరిగి గుత్తికి బయలుదేరారు. బసినేపల్లి గ్రామ శివారు మలుపులో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న షానవాజ్, అవినాష్, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఆటో డ్రైవర్ గౌస్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అవినాష్‌ను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి..

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఆంజనేయులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యల్లనూరు మండలం గొడ్డుమర్రి గ్రామానికి చెందిన ఆంజనేయులు కసాపురం గ్రామంలో ఆంజనేయ స్వామి దర్శనానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అయితే తొండపాడు గ్రామంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆంజనేయులు, షానవాజ్, ఆటో డ్రైవర్ గౌస్

ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్‌డే

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ (అటానమస్) డిగ్రీ కళాశాలలో గురువారం ఓపెన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలను పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. 58 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిల్లాలోనే ప్రసిద్ధి చెందిందన్నారు. ఎందరో విద్యార్థులను సమాజంలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దిందని చెప్పారు. స్వయంప్రతిపత్తి హోదా, న్యాక్- ఏ గ్రేడ్ కలిగిన కళాశాలలో 13 డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అత్యాధునిక వసతులతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్స్ ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌సీసీ జేకేసీ, హాస్టల్ వసతులు ఉన్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలను నిర్వహించి ప్రముఖ సాఫ్ట్‌వేర్, తదితర వాణిజ్య కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వ విద్యాసంస్థ అని పేర్కొన్నారు. ఇంటర్ పూర్తి కాగానే తమ కళాశాలలో అడ్మిషన్ పొంది ఉన్నత చదువులకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు డాక్టర్ జనార్దన్ శాస్త్రి, రవిశంకర్ శర్మ, జమీలాబీబీ, డాక్టర్ గోపినాయక్, వాణిశ్రీ, బసవరాజు, శివశంకర్, శ్రీనివాసులు, తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యాపకులు

ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి

గుంతకల్లు: గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కేంద్ర ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కమిటీ మెంబర్లుగా రిటైర్డు డాక్టర్ రామ్మూర్తి నాయుడు, డాక్టర్ పవన్ కుమార్, యుగంధర్, రాయల్ వెంకటేష్, ఇందిరమ్మ, జీవిత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జీ.జయవర్ధన్ రెడ్డి కమిటీ మెంబర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కల్పించాల్సిన మౌలిక వసుతులు, అభివృద్ధికి తీసుకోవాల్సి పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి కృషి చేస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాగా ఉన్నప్పుడు హిందూపురం జిల్లా ఆస్పత్రిగా ఉండేదని తెలిపారు. ప్రసుత్తం జిల్లాలు వేరు కావడంతో ప్రసుత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రి లేదన్నారు. గుంతకల్లును అప్‌గ్రేడ్ చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ కేసీ హరి, యాదవ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ మస్తాన్ యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, పత్తి హిమబిందు, అనంతపురం పార్లమెంట్ కురబ సాధికారిక జిల్లా అధ్యక్షుడు కే.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం



గుంతకల్లు: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా పార్టీలో సమర్థవంతమైన నాయకులను మండల కన్వీనర్లను నియమించారు. పార్టీలో నూతనోత్తేజం తీసుకొచ్చేందుకు కన్వీనర్లుగా బాధ్యతలు అప్పజెప్పారు. పార్టీ కన్వీనర్ల నియామకంలోనూ వైఎస్ జగన్ సామాజిక న్యాయం పాటించారు. అన్ని వర్గాల నాయకులకు చోటు కల్పించారు. గురువారం గుంతకల్లు నియోజకవర్గ మున్సిపాలిటీ, మండల కమిటీలను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. గుంతకల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఎండీఆర్ ఖలీల్, రూరల్ అధ్యక్షుడిగా బోయ రాము, గుత్తి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా కే.మధుసూదన్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడిగా జి.గంగరాజు, పామిడి నగర పంచాయితీ అధ్యక్షుడిగా నగూర్ ఈశ్వర్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడిగా రామవత్ రామకృష్ణ నాయక్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

శింగనమల: నిబంధనలు విధించకుండా రైతుల నుంచి కందులు కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు కోరారు. శుక్రవారం శింగనమలలోని మార్కెఫెడ్ గోడౌన్ కార్యాలయంలో కందుల కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరాకు 2 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన విధించడం సరికాదన్నారు. 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు ప్రభుత్వమే మార్కెఫెడ్ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎకరాకు రూ.7,550 నగదుతో పాటు అదనంగా ఒక్కో క్వింటాకు రూ.2 వేలు బోనస్ ప్రకటించాలని కోరారు. మార్కెఫెడ్ అధికారులు నిబంధనలు విధిస్తూ పండిన కందులను కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీపతి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మార్కెఫెడ్ గోడౌన్‌లో కందులను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో బొలికొండ రంగనాథ స్వామి ఉత్సవ విగ్రహాలు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి ఉత్సవ విగ్రహాన్ని జక్కలచెరువు గ్రామం నుంచి రాత్రి 10 గంటల సమయంలో ఊరేగింపుగా తీసుకొచ్చి తొండపాడు గ్రామంలోని ఆలయంలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. ధ్వజారోహణ, అంకురార్పణతో స్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తిరునాల సందర్భంగా ఆలయ ఆవరణలో భారీగా తినుబండారాలు, గాజులు, చిన్న పిల్లల ఆట వస్తువులు విక్రయించే దుకాణాలు వెలిశాయి. పెద్ద జాయింట్ వీల్‌లు, ఊయలలు ఏర్పాటయ్యాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ ఈఓ రామాంజనేయులు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సింహ వాహనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

10న అల్బెండజోల్ మాత్రల పంపిణీ



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

శింగనమల: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 10వ తేదీన 1-19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని సీహెచ్ఓ గంగాధర తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత, పోషకాహారం లోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులందరికీ, బడి బయట ఉన్న వారికి అల్బెండజోల్ మాత్రలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగభూషణం రెడ్డి, ఎంపీహెచ్ఏ నాగరాజు, ఏపీఓ శ్రీదేవి, సచివాలయ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సూచనలిస్తున్న ఎంఈఓ-2 గురుప్రసాద్

పెద్దవడుగూరు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిత్రచేడు, పి.వీరన్నపల్లి గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పబ్లిక్ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బోధించిన పాఠాలను మరోసారి పునశ్చరణ చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏదైనా సమస్యలు వస్తే వెంటనే స్థానిక ఉపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. పరీక్షలకు సిద్ధం అయ్యే సమయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏ విధంగా అందించాలి? మంచి మార్కులు సాధించడానికి ఎలా రాయాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, వెంకట రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు ఎంపీడీఓగా బరెన్ సాహెబ్

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు ఎంపీడీఓగా బరెన్ సాహెబ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీఓగా బరెన్ సాహెబ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

10 నుంచి పారిశుధ్యంపై కళాజాత

పుట్లూరు: ఈనెల 10వ తేదీ నుంచి మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్యం, తాగు నీరు, మొక్కల పెంపకం తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కళాజాత నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆరు రోజుల పాటు 23 గ్రామ పంచాయతీల్లో కొనసాగుతుందన్నారు.

నేడు నార్పలలో జాబ్ మేళా

శింగనమల: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నార్పల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7వ తేదీ (శుక్రవాకం) జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. డేవిడ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో ఐఐఎఫ్ఎల్, యంగ్ ఇండియా తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకున్న యువత అర్హులన్నారు. వివరాలకు కళాశాల, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ ఆదినారాయణ, ఎస్‌పీఓసీ ఉమాశంకర్‌రెడ్డిని సంప్రదించాలన్నారు.

దత్త పాదుకా క్షేత్రంలో పూజలు



అలంకరణలో దత్తాత్రేయ స్వామి

పామిడి: పట్టణంలోని అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో గురువారం నవమి నాంది ప్రారంభ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయుడిని ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం ఉదయం 11:45 గంటలకు నవగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని గురుదత్త సేవాసమితి కార్యవర్గ సభ్యులు ఎంహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్ఎస్ఎమ్ శ్రీధర్ తెలిపారు. నవగ్రహ హోమం, పూర్ణాహుతి అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

9న కోటంకలో అన్నదానం

గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేదీన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. తిరునాలలో భాగంగా తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం భార్య వెంకట సుబ్బమ్మ, కుమారులు కొండారెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, నారాయణరెడ్డి అన్నదానం చేస్తారని పేర్కొన్నారు.